

# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

# రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

## చివరి విడత: మలి సందడి (22)

*స్నేహానంద లహరి*

దేవ్‌దార్ తలని పైకీ కిందకీ తమాషాగా కదుపుతూ – 'కుక్కుక్ కుక్కుక్' అన్నాడు.

పిల్లలిద్దరూ అతణ్ణే చూస్తూ కిల కిల నవ్వుతూ, 'మళ్లీ' అన్నారు.

దేవ్‌దార్ మళ్లీ అలాగే తలని పైకీ కిందకీ తమాషాగా కదుపుతూ – 'కుక్కుక్ కుక్కుక్' అన్నాడు.

పిల్లలు, 'మళ్లీ' అన్నారు.

అలా రెండు మూడుసార్లు జరిగేక దేవ్‌దార్ గుమ్మంలో ఉన్న మమ్మల్ని చూసి, 'కుక్కుక్ కు...' అని సగంలో ఆపేశాడు.

అప్పుడు పిల్లలు కూడా మమ్మల్ని చూశారు.

పాప వెంటనే, "ప్లీజ్ అంకుల్, మా అమ్మకీ నాన్నగారికీ కూడా చెప్పండి'' అంది.

దేవ్‌దార్ మొహమాటపడ్డాడు. అది గ్రహించిన నేను, "అంకుల్ని అలా సతాయించకూడదు. తప్పు'' అన్నాను.

పాప మొహం ముడుచుకుంది.

దేవ్‌దార్ పాప భుజం తట్టి, "ఒకే, డోన్ట్ వర్రీ! ఐ విల్ టెల్ యువర్ మమ్మీ అండ్ డాడీ ఆల్సో'' అన్నాడు.

పాప మొహం వికసించింది.

విషయం అర్థం కాక, "వాళ్లు చెప్పమనడం, నువ్వు చెబుతాననడం, ఏం జరుగుతోంది మీమధ్య?'' అన్నాను.

"ఏంలేదు రావ్! మీవాళ్లకి కుక్కూ ఊర్ గురించి చెప్పాను. వాళ్లకి చాలా నచ్చింది'' అన్నాడు దేవ్‌దార్.

కుక్కూ అంటే కోయిల. ఊర్ అంటే గడియారం.

జర్మనీలో తయారయ్యే గడియారాల్లో కుక్కూ ఊర్ ఒక ప్రత్యేక ఆకర్షణ.

సాధారణంగా ఈ గడియారాలు యూరప్‌లోని ఇళ్ల ఆకారంలో ఉంటాయి. క్రింద లోలకం ఊగుతూంటుంది. పైన గడియారం తిరుగుతుంటుంది. ఆపైన చిన్న గూడు. దానికో తలుపు. అది గంటకోసారి తెరుచుకుంటుంది. అందులోంచి ఓ పక్షిబొమ్మ బైటకొచ్చి, తల పైకీ కిందకీ ఆడిస్తూ, 'కుక్కుక్ కుక్కుక్' అని మధురస్వనం వినిపించి లోపలకు వెడుతుంది. వెంటనే తలుపు మూసుకుంటుంది.

ఇండియాలో హైదరాబాదులో సాలార్‌జంగ్ మ్యూజియంలో ప్రత్యేక ఆకర్షణగా ఇలాంటి గడియారమే కాస్త పెద్ద సైజుది ఉంది. అందులో గంటకోసారి తలుపు తెరుచుకుని ఓ మనిషిబొమ్మ బయటికొచ్చి – అప్పుడు టైమెంతయితే అన్ని గంటలు కొట్టి మళ్లీ లోపలకు వెళ్లిపోతుంది.

సాలార్‌జంగ్ మ్యూజియానికి వెళ్లినవాళ్లు – ఈ గడియారాన్ని చూడకుండా వెళ్లరు.

కొందరైతే కేవలం ఈ గడియారాన్ని చూడ్డానికే అక్కడికి వెడతారు.

ఈ గడియారాన్ని ప్రదర్శించే హాల్లో మధ్యాహ్నం పన్నెండు అయ్యే సమయానికి జనం క్రిక్కిరిసి ఉంటారు. బొమ్మ ఎక్కువ గంటలు కొడుతుంది కదా – అందుకని!

కుక్కూ ఊర్ గురించి ల్యూనబర్గ్‌లో జర్మన్ భాష నేర్చుకుంటున్న సమయంలో విన్నాం.

మన దేశంలో ఓ గొప్ప మ్యూజియానికి మాత్రమే పరిమితం అనుకున్న అలాంటి గడియారం, ఇక్కడ ఇంటింటా అలంకరించుకునేందుకు వీలుగా లభ్యమౌతోందని ఆశ్చర్యంగా అనుకున్నాం.

నాకు ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ గాడ్జెట్సుమీదా, పిల్లల బొమ్మలమీదా ఉన్నంత ఆసక్తి – ఇలాంటి గృహాలంకార ఉపకరణాలపై లేకపోవడం వల్లనేమో – ఇంట్లో ఇంతవరకూ కుక్కూ ఊర్ ప్రస్తావన తేలేదు.

దేవ్‌దార్ కుక్కూ ఊర్ కొన్నాట్ట.

పిల్లలకు దాని గురించి చెబుతూ, అదెలా పని చేస్తుందో చెబుతున్న సమయంలో మేమక్కడికి వెళ్లాం.

అతడు చెప్పే విధానం పిల్లలకి నచ్చింది. మాక్కూడా చెప్పమంటున్నారు.

“అంకుల్ – మీరింకా చెప్పడం లేదు’’ అంది పాప.

“కుక్కుక్... కుక్కుక్...’’ అన్నాడు దేవ్‌దార్ – అచ్చం కోయిల కూసినట్లే.

ఒక ప్రొఫెసర్ అలా కూస్తుంటే నవ్వొచ్చింది. ఆపుకున్నాను.

“మళ్లీ’’ అంది పాప.

“కుక్కుక్... కుక్కుక్...’’ అన్నాడు దేవ్‌దార్ మళ్లీ.

శ్రీమతి చటుక్కున వెనక్కి తిరిగి, వంటింటివైపు వెళ్లింది. నవ్వాపుకోలేకే తనా పని చేసిందనిపించింది.

“మయ్యా’’ అన్నాడు బాబు.

“కుక్కుక్... కుక్కుక్...’’ అన్నాడు దేవ్‌దార్ మళ్లీ.

“మళ్లీ’’ అంది పాప.

“ఇక చాల్లే – అంకుల్నలా ఇబ్బంది పెట్టకూడదు’’ అని పాపని మందలించాను.

“ఇబ్బందా, నాకా? కుక్కూ ఊర్ కొని ఇంట్లో మొదటిసారి ఆ కూత విన్నప్పుడు కూడా నాకింత ఆనందం కలుగలేదు. వాళ్లు అడుగుతున్నారని నువ్వనుకుంటున్నావ్ కానీ, అడక్కుండానే వాళ్లకు మళ్లీ మళ్లీ చెప్పాలని నాకనిపిస్తోంది’’ అన్నాడు దేవ్‌దార్.

అప్పుడతడి మొహం చూస్తే – మా పిల్లలిద్దరి పక్కనా తనూ ఓ పిల్లాడిలా ఉన్నాడు.

“ఇంతకీ నువ్వు మావాళ్లతో ఎలా కమ్యూనికేట్ చేశావు?’’ అన్నాడు.

దేవ్‌దార్ నవ్వి, “భాష పెద్దలకోసం. పిల్లలకి భాషతో నిమిత్తం లేదు. అందుకే పుట్టుకతోనే – కళ్లు, ముక్కు, చెవులు వగైరాలన్నీ ఇచ్చిన దేవుడు మనిషికి భాషని మాత్రం ఇవ్వలేదు. ఒకసారి తన అవయవాలన్నీ సక్రమంగా పని చెయ్యడం మొదలెట్టేక మనిషి భాషని నేర్చుకుంటాడు. మనిషిని మనిషినుంచి వేరు చెయ్యడమనేది భాషతోనే మొదలౌతుంది’’ అన్నాడు దేవ్‌దార్.

అతడు భావుకుడు. ఆలోచనాపరుడు.

అతడప్పుడన్న మాటలు చాలా లోతైనవి.

పిల్లలకు జాతి, మత, కుల, భాషా భేదాలు తెలియవు. మనిషిని మనిషిగానే చూస్తారు. పిల్లలందరూ ఎప్పటికీ పిల్లలుగానే ఉండిపోయే ప్రపంచమొకటి ఎక్కడైనా ఉంటే ఎంతా బాగుణ్ణు?

ఈలోగా శ్రీమతి ప్లేట్లు తీసుకునొచ్చింది.

ఆమె ముందు మాకు వడ్డిస్తానంటే దేవ్‌దార్ ఒప్పుకోలేదు.

అంతా కలిసే తిందామంటూ అక్కణ్ణించి తన వంతు సాయం చేశాడు.

టిఫిన్ తింటున్నప్పుడు చెప్పాడు దేవ్‌దార్.

అతడికి పిల్లలంటే చాలా ఇష్టమట. జర్మనీలో తనున్నచోట ఎవరింటికైనా వెడితే, ఎక్కువ సమయం పిల్లలతోనే గడుపుతాట్ట.

వాళ్లలో ఎక్కువమంది హిందీవాళ్లు.

అక్కడ తెలుగువాళ్లు ఒకరిద్దరున్నారు కానీ, వాళ్లు పిల్లల్ని ఇండియాలో వదిలి వచ్చారు.

మా ఇంటికొస్తున్నప్పుడు మా పిల్లలతో మాట్లాడ్డంకోసమని, ఆ తెలుగువాళ్ల దగ్గర కొన్ని పడికట్టు పదాలు నేర్చుకునొచ్చేట్ట. దాంతో మావాళ్లతో వ్యవహరించడం అతడికి సులభమైపోయింది.

దేవ్‌దార్ ఫలహారాన్ని మెచ్చుకున్నాడు. మా పిల్లల్ని మెచ్చుకున్నాడు.

మా జంటని కూడా మెచ్చుకుని, "పెళ్లి విషయంలో బాగా ఆలస్యం చేశానని మిమ్మల్ని చూసేక అనిపిస్తోంది నాకు. ఇండియాకు తిరిగి వెళ్లగానే, పెళ్లి చేసుకుంటానని మా వాళ్లకి రేపే ఉత్తరం వ్రాసేస్తాను" అన్నాడు.

కాంప్లిమెంటు ఇవ్వడంలో ఒకొక్కరిది ఒకో పద్ధతి – అనుకున్నాను.

ఓ గంట కూర్చుని వెళ్లిపోదామనుకున్నవాడు – సుమారు నాలుగు గంటలున్నాడు. బై చెప్పేటప్పుడు టైం చూసుకునేదాకా ఆ విషయం మాకూ తెలియలేదు.

పిల్లలైతే అతడికి బాగా చేరికయ్యారు. అతడు వెళ్లిపోతుంటే – "అంకుల్ మళ్లీ రండి" అంది పాప.

"మయ్యా లంది" అన్నాడు బాబు.

దేవ్‌దార్ ఇద్దర్నీ దగ్గరగా తీసుకుని గట్టిగా హత్తుకుని వదిలాడు. అతడి కళ్లలో కొద్దిగా నీళ్లు.

ఆ నీళ్లెందుకో నాకు తెలుసు.

ప్రస్తుతం జర్మనీలో మేముంటున్నది వేర్వేరు ప్రాంతాల్లో.

ఇండియా వెడితే – అతడు స్థిరపడ్డది మహారాష్ట్రలో. నేను ఒరిస్సాలో.

మేము పని చేసే సంస్థలు వేరు.

మేమిద్దరం రైల్లో కలిసిన ప్రయాణీకుల వంటివాళ్లం. విడిపోయేక మళ్లీ కలిసే అవకాశాలు తక్కువ.

పిల్లలు మళ్లీ రమ్మన్నప్పుడు – నాకులాగే అతడికీ ఆ విషయం స్ఫురించినట్లుంది.

గుమ్మం దాటి మెట్లు దిగి రోడ్డుదాకా వెళ్లి అతణ్ణి సాగనంపి వచ్చేక శ్రీమతి నాతో, "వెళ్లేముందు ఒక్కసారి అతణ్ణి కుక్కుక్ కుక్కుక్ అనమనాలనిపించింది. బాగుండదని ఊరుకున్నాను" అంది. కానీ ఇంట్లోకి వెళ్లేక మా ఇద్దరికీ కూడా కాసేపు "కుక్కుక్... కుక్కుక్..." అన్న మధురస్వనం చెవులను తడుతూనే ఉంది.

పిల్లల్ని అలరించడానికి అతడు ప్రత్యేకంగా అభ్యసించిన మధురస్వనమది.

అంత తేలికగా ఆ స్మృతులు మమ్మల్ని వీడునా?

ఆ తర్వాత దేవ్‌దార్‌ని మళ్లీ కలుసుకోలేదు.

కానీ అతణ్ణి తల్చుకున్నప్పుడల్లా ఆ మధురస్వనం, అతడు పక్కనే ఉన్నాడా అనిపించేటంత స్పష్టంగా వినిపిస్తూంటుంది....

ఆ తర్వాత ల్యూనబర్గులో భాషాధ్యయన మిత్రుల్లో బెర్లిన్ వచ్చినవారిలో నటరాజన్, రామచంద్ర ఉన్నారు.

నటరాజన్ అవివాహితుడు.

ల్యూనబర్గులో క్రిస్టాలూథర్ ప్రత్యేకంగా ఆహ్వానించే విదేశీబృందంలో నాతోపాటు అతడూ ఒకడు.

నటరాజన్‌కి టైపింగ్ బాగా వచ్చు. జర్మనీలో అతణ్ణి ఆకర్షించినవాటిలో ఎలక్ట్రిక్ టైపురైటరు ఒకటి.

అతడు చెప్పేదాకా నాకు దాని విశిష్టత తెలియదు. తర్వాత అక్కడి లాబ్‌లో అది వాడినా దాని విశిష్టతని అంతగా పట్టించుకోలేదు.

అందులో మనం టైపు చేసిన వాక్యాల్ని రికార్డు చేసుకుని సరి చేసుకోవచ్చు. కీబోర్డుని మెత్తగా తాకినా, గట్టిగా నొక్కినా అక్షరం ఒక్కలాగే పడుతుంది.

తను బెర్లిన్ వచ్చేముందు – నాకుత్తరం వ్రాశాడు.

తనో ఎలక్ట్రిక్ టైపు రైటరు కొనిస్తే దాన్ని ఇండియాకి తీసుకెళ్ళే నా సామాన్లలో కలుపుకోగలనా అని.

విమానంలో ఒక టికెట్‌కి పెట్టెల బరువు ఇన్ని కేజీలనీ, కూడా ఉంచుకునే చేతి సామాను బరువు ఇన్ని కేజీలనీ పరిమితి ఉంటుంది. అదనపు బరువుకి కేజీకింత అని వసూలు చేసే రుసుము చాలా ఎక్కువ. అందుకని అదనపు బరువు లేకుండా చూసుకోవడం విమాన ప్రయాణీకులు తీసుకునే జాగ్రత్తల్లో ముఖ్యమైనది.

నటరాజన్ ఒక్కడు. నేను, శ్రీమతి, ఇద్దరు పిల్లలు కలిపి మావి నాలుగు టికెట్లు కాబట్టి – మేము నాలుగు రెట్లు ఎక్కువ బరువును కూడా తీసుకెళ్ళొచ్చు. అందుకని నటరాజన్ ఈ విషయంలో మా సాయం కోరాడు. ఐతే ఎంత చెట్టుకి అంత గాలి అన్నట్లు, మావద్ద మా టికెట్లకి తగ్గ సామానుండొచ్చు కాబట్టి, నాకు వీలేనా అని మర్యాదగా అడుగుతూ ఉత్తరం వ్రాశాడతడు.

మాది అటూ ఇటూ కూడా పెద్ద కుటుంబం. అది కాక – భువనేశ్వర్లో మిత్రులున్నారు. అందుకని వెళ్ళేటప్పుడు చాలామందికి రకరకాల కానుకలు తీసుకెళ్ళే ఉద్దేశ్యంలో ఉన్నాం. ఇక కొత్తగా విదేశానికి వచ్చాం కాబట్టి మాకోసమూ ఎన్నో కొన్నాం. ఇంకా కొనబోతున్నాం. ప్రయాణానికి ఉన్న బరువు పరిమితులవల్ల వాటిలో కొన్ని ఇక్కడ వదిలేయాలని ఉసూరుమంటోంది. ఇక ఇతరుల బరువుల బాధ్యత తీసుకునే ప్రసక్తి ఏముంది?

ఐతే అడిగినవాడు నటరాజన్. ల్యూనబర్గులో ఉండగా అతడికి ఎంతో ఋణపడ్డానన్న భావన నాకుంది. మళ్ళీ అతడూ, మేమూ కలుసుకునే అవకాశముందో లేదో!

ఋణం తీర్చుకుందుకు ఇదో చిన్న అవకాశంగా భావించాను.

మరో మాటనకుండా – మాకు వీలేనని బదులిచ్చాను.

నటరాజన్ మా ఇంటికొచ్చినప్పుడు టైపురైటరు తెచ్చిచ్చాడు.

"ఇలాంటి విషయాల్లో చాలామంది నిర్మొహమాటంగా ఉంటారు. నీకు మొహమాటమెక్కువని తెలిసి కూడా నేను నిర్మొహమాటంగా ఈ బరువు నీకు అంటగడుతున్నాను. నువ్వు కాదంటే ఏమాత్రం అపార్థం చేసుకునేవాణ్ణి కాదు కానీ, ఔనన్నందుకు చాలా సంతోషించాను. ఎందుకంటే – నాకు బాగా తెలిసినవాళ్లూ – మా ఊరివాళ్లూ (అంటే నాగపూర్) – కూడా వేరే బరువులు లేనివాళ్లూ – ఇద్దరు ముగ్గుర్ని ఈ విషయమై కదిపి చూశాను. కస్టమ్సు డ్యూటీ ఎంత పడితే అంతా నేనిచ్చుకుంటానని హామీ కూడా ఇచ్చాను. ఐనా వాళ్లొప్పుకోలేదు. నువ్వొప్పుకున్నావు'' అని నన్ను చాలా మెచ్చుకున్నాడు.

నిజానికి నేనతడికి ఋణగ్రస్థుణ్ణి. అతడేమో నేను తనకి ఫేవర్ చేస్తున్నానంటున్నాడు.

అది అతడి సంస్కారం, మర్యాద!

నటరాజన్ అసలు సిసలు భారతీయుడు. కావడానికి తమిళుడైనా హిందీ, మరాఠీల్లో నిష్ణాతుడు. అతడికి నాగపూర్ మాతృభూమిలా అనిపిస్తుంది.

అతడు మా ఇంటికొచ్చినప్పుడు బాగా దగ్గర చుట్టం మా వచ్చినట్లు అనిపించింది.

అతడు మా ఇంట్లో గడిపిన రెండు గంటలూ రెండు క్షణాల్లా గడిచిపోయాయి. గ్యోతే ఇన్‌స్టిట్యూట్లో కొన్ని సంఘటనల్ని గుర్తు చేసుకోవడం మధురంగా అనిపించింది.

వద్దంటున్నా వినకుండా అతగాడు నాకు కస్టమ్సు డ్యూటీకని మార్కుల్లో కొంత కరెన్సీ ఇచ్చి వెళ్లాడు.

బెర్లిన్ వచ్చిన మరో ల్యూనబర్గు మిత్రుడు రామచంద్ర. అక్కడుండగా నాకు ఇంటివంటని రుచి చూపించిన మహానుభావుడు. ప్రతి విషయంలోనూ తనే ముందున్నట్లు గుర్తింపు పొందాలనే తాపత్రయంతోనే ఐనా – ఎందరికో ఎన్నో చేసిన మంచివాడు. అతడివల్ల ప్రయోజనం పొందుతూనే, అతడి తాపత్రయాన్ని నిరసించినవారు కొందరున్నారు. నాకు మాత్రం, అతడక్కడ మంచి తమ్ముడు.

రామచంద్రకి కొత్తగా పెళ్లయింది.

లాంగ్వేజి కోర్సు అవగానే అతగాడు తనుండే గ్యోటింగన్‌కి భార్యని రప్పించుకున్నాడు.

ఈడూజోడూ కుదిరింది. చిలకా గోరింకల్లా చూడముచ్చటగా ఉన్న జంట.

కన్నడం వారైనా ఇద్దరూ తెలుగు బాగానే మాట్లాడతారు. దాంతో శ్రీమతికీ, పిల్లలకీ వాళ్లతో కాలక్షేపానికి ఇబ్బంది లేకపోయింది. అందువల్ల నేనూ, రామచంద్ర – గతించిన ఎన్నో అనుభవాల్ని పునశ్చరణ చేసుకున్నాం.

రామచంద్ర తనున్నచోట ఎందరికి ఎలా ఉపయోగపడ్డాడో చెప్పాడు.

ఆ విషయంలో నేను మంచి శ్రోతను కావడం అతడి ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది.

ఆ టాపిక్‌నుంచి మళ్లించడానికి – "కొత్త జంట. కొత్త దేశం. రమ్యమైన వాతావరణం. కొత్త కాపురం ఎలాగుంది?'' అనడిగాను.

అప్పుడు రామచంద్రలో కొత్త ఉత్సాహం చూసాను. "రావుగారూ! మీకు నిజం చెప్పాలి. మా ఇంట్లో పాతకాలపు ఆచారాలదే ప్రాధాన్యం. పెళ్లయ్యేక మాకు ఏకాంతం కావాలంటే రాత్రి భోజనాలయ్యేదాకా ఆగాల్సిందే. అందుకు బాధపడ్డ సందర్భాలూ లేవు. నలుగురితోపాటు నారాయణా అన్నట్లు – అదంతా మామూలుగానే అనిపించేది. ఇండియాలో ఉండగా హనీమూన్ గురించిన ఆలోచనే రాలేదు. ఇక్కడికొచ్చేక నాకు హనీమూన్ కొచ్చినట్లే ఉంది. ఇలాంటి అదృష్టం మీకెవరికీ కలిగుండదు'' అన్నాడతడు.

అన్ని విషయాల్లోనూ తనూ, తన అనుభవాలూ మిగతావాళ్లకి భిన్నంగా ప్రత్యేకమని అనుకుంటాడు రామచంద్ర. అదే అతడిలో ప్రత్యేకత!

ఐతే నా అదృష్టం విషయంలో అతడన్న మాటతో నేను పూర్తిగా ఏకీభవించలేను.

మాకు పెళ్లయి కాపురం పెట్టేక, ఇంచుమించు వెంటనే ఉద్యోగంలో చేరాను. ఆఫీసిచ్చిన మూడు గదుల క్వార్టర్సులో నాలుగు పంఖాలున్నాయి. షవరున్న బాత్రూం. మిగతా ఇల్లు కూడా బాగా విశాలం.

అంతింటికీ మేమిద్దరమే. అక్కడ మాకు దొరికిన స్వేచ్ఛ మధురాతి మధురం.

ఆ విషయం రామచంద్రకు చెప్పడంవల్ల – అతడి ఉత్సాహం మీద నీళ్లు చల్లడం మినహా మరో ప్రయోజనం ఉండదనిపించింది. "మా అదృష్టాన్ని అంచనా వేసుకుందుకు ముందు నీ అనుభవాలు చెప్పు'' అన్నాను.

నేనది మామూలుగా మాటవరసకన్నట్లు అన్నాను కానీ రామచంద్ర – చాలా సీరియస్‌గా బదులిచ్చాడు.

"అందమైన ఇల్లు. ఆ ఇంట్లో మేమిద్దరమే. సినిమా సెటింగ్‌లా బెడ్రూం. బాత్రూంలో షవరు, టబ్బు. ఏంచెప్పను? రొమాంటిక్ ఫిల్మ్ షూటింగులా ఉంది మా దాంపత్య జీవితం'' అన్నాడు రామచంద్ర.

అతడు తమ అనుభవాలు కాస్త వివరంగానే చెప్పినా – ఆ రొమాంటిక్ దృశ్యాలు విశ్వనాథ్ దర్శకత్వంలో షూటింగు పరిధికి లోబడే ఉన్నాయి.

చెబుతుంటే రామచంద్ర కళ్లలో మెరుపులు.

అప్పుడు నాకనిపించింది.

మనం ఉమ్మడి కుటుంబాల గొప్పతనం గురించి చాలా ఎక్కువగా చెప్పుకుంటాం.

కొత్తగా పెళ్లయినవారికి ఉమ్మడి కుటుంబాల్లో ఏకాంతం దొరకొచ్చు కానీ – ఆ వయసుకి అవసరమైన స్వేచ్ఛ దొరకదు. అది ఎంత పెద్ద లోటో, ఇప్పుడు రామచంద్ర కళ్లలో మెరుపు చూస్తే ఊహించొచ్చు.

నా చిన్నతనంలో చాలా పెళ్లిళ్లు చూశాను. ఉమ్మడి కుటుంబాల్లో ఉంటున్నప్పుడు – కొత్తగా పెళ్లయినవారు, వేరు కాపురం పెడతామంటే, అదేదో పెద్ద తప్పు అన్నట్లు జరిగే చర్చలు విన్నాను.

అలాంటి జంటలమీద నాకూ దురభిప్రాయముండేది.

రామచంద్ర కళ్లలో మెరుపు చూసేక – వాళ్లకెలాంటి అన్యాయం జరిగిందో స్ఫురించింది. కాస్త ఆలస్యంగానే ఐనా ఆ రోజు వాళ్లమీద జాలి పడ్డాను.

రామచంద్ర దంపతులు ఉదయమే వచ్చారు. వాళ్లకి ఉప్మా టిఫిను. అందులోకి ఆట్టే కారం లేకుండా చట్నీ. అతడు కాఫీ ప్రియుడు కాబట్టి వాళ్లిద్దరికీ కాఫీ.

ఆ కాఫీ తాగుతూ రామచంద్ర ల్యానబర్గులో ఎడుషో కాఫీని గుర్తు చేసుకున్నాడు.

క్లాసులున్నప్పుడు సాయంత్రాలు కాఫీ కోసం తరచుగా ఎడుషో పేరిట ఉన్న షాపుకి వెళ్లేవాడు. అతడితోపాటు మరో కొలీగ్ సుబ్రహ్మణ్యం వచ్చేవాడు. కాఫీ తాగకపోయినా నేనూ వెళ్లి కంపెనీ ఇచ్చేవాణ్ణి.

మామూలుగా హొటళ్లలో ఐదు మార్కులుండే కాఫీ అక్కడ యాభై ఫెన్నిగ్సుకే దొరికేది.

ఆ షాపుని కనుగొన్న ఘనత తనదేనని రామచంద్ర గొప్పగా చెప్పుకునేవాడు. సుబ్రహ్మణ్యం ఒప్పుకునేవాడు కాదు. పైగా, "నువ్వొచ్చేదాకా ఇక్కడీ షాపు ఉన్నట్లు ఈ ఊరివాళ్లకే తెలియదుట. అమెరికాకి కొలంబసు – ఎడుషోకి రామచంద్ర!" అనేవాడు వ్యంగ్యంగా.

ఇచ్చింది కాంప్లిమెంటయితే – అది వ్యంగ్యమైనా ఫరవాలేదనేవాడు రామచంద్ర.

ఎడుషో గురించి సుబ్రహ్మణ్యం తనకిచ్చిన కాంప్లిమెంటుని కూడా ఇప్పుడు నా శ్రీమతికి గొప్పగా చెప్పాడు.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments